

కృష్ణా జట్టు ఘనవిజయం

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు విజయం సాధించింది. - 8లో



రెచ్చగొట్టి.. రచ్చ చేసిన తమ్ముళ్లు

గొడవలు సృష్టించాలని ప్రయత్నించిన టీడీపీ నాయకుల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. పీటీఎం సచివాలయం బయట ఉన్న శిలాఫలకాలు తొలగించే యత్నాన్ని అడ్డుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.220	రూ.298



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 627 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	230	230
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 26.660 కిలోలు

రేషన్ బండి.. ఇక రాదండి

బియ్యంకోసం 2 కిలోమీటర్లు వెళ్లాలి



నా పేరు ఉషారాణి.రాజంపేట మండలం నూతిపల్లి గ్రామం.బియ్యం తెచ్చుకోవాలంటే రెండు కిలోమీటర్ల దూరంలోని పులపుత్తూరుకు వెళ్లాలి. జగనన్న పుణ్యమా అని ఇంటి వద్దకు బియ్యం బండి వచ్చి వచ్చేది. సరుకులు అందించేవారు. కూటమి సర్కార్ రేషన్ బండి రద్దు చేస్తే అగచాట్లు పడాల్సి వస్తుంది.



- సరుకులు అందించే వాహనాలకు కూటమి సర్కార్ మంగళం
- ఇంటింటికి సరుకుల పంపిణీకి చెల్లుచీటీ

సాక్షి రాయచోటి : ఇంటింటికి అందించే రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమానికి త్వరలో శుభం కార్డు పడనుంది. నిత్యావసర సరుకులకు చౌక డిపోల వద్ద ఎదురుచూడాల్సిన పనిలేకుండా వైఎస్ జగన్ సర్కార్ తీసుకొచ్చిన విధానానికి ప్రస్తుత కూటమి సర్కార్ మంగళం పాడబోతోంది. రెండు రోజుల కిందట జిల్లా కలెక్టర్లు, ఎస్పీల ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు సీఎం చంద్రబాబు సరుకులు డోర్ డెలివరీ విధానాన్ని రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. గతంలో రేషన్ సరుకుల కోసం ప్రజలు నిరీక్షించే పరిస్థితి ఉన్న నేపథ్యంలో అప్పటి జగన్ సర్కార్ ఇంటింటికి రేషన్ విధానాన్ని తీసుకొచ్చింది. కొంతమంది నిరుద్యోగులకు వాహనాన్ని అందించడం ద్వారా ఉపాధి కల్పించింది.

జిల్లాలో వ్యాప్తంగా 5,04,825 రేషన్‌కార్డులు

జిల్లాలో దారిద్య్రరేఖకు దిగువన ఉన్న సుమారు 5,04,825 తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి సంబంధించి ప్రతినెల బియ్యం,కందిపప్పు లాంటి సరుకులను ప్రజలు తీసుకుంటున్నారు. కార్డుదారులకు ఇళ్ల వద్దనే అందిస్తుండడంతో 90 శాతానికి పైగా పంపిణీ కొనసాగేది. ఈ డోర్‌డెలివరీ వ్యవస్థను రద్దుచేస్తే మళ్లీ రేషన్ దుకాణాల వద్ద క్యూలైన్లలోనిలబడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. జిల్లాలో నిత్యావసర సరుకులు పంపిణీకి సంబంధించి 311 డోర్ డెలివరీ చేసే వాహనాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఒక ఆపరేటర్ అందుబాటులో ఉంటారు. ఈ వ్యవస్థ రద్దు కానుండటంతో 311 వాహనాలు మూలనపడనున్నాయి.

సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోని నేతలు చిరుద్యోగులతో పాటు పలువురిని వేధింపులకు గురిచేస్తున్నారు. చిరుద్యోగులను ఉద్యోగం నుంచి తొలగించే చర్యలు చేపడుతున్నారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా 311 రేషన్ డోర్ డెలివరీ వాహనాలు కూడా మూలన పడడం ద్వారా అందుకు సంబంధించిన ఆపరేటర్లు ఉపాధిని కోల్పోనున్నారు.అప్పట్లో వాహనం కొనుగోలుకు 70:30 శాతం ప్రకారం రుణం చెల్లించేలా నిర్ణయిస్తూ రూ. 6 లక్షలతో వాహనాన్ని అప్పగించింది. వాహనదారుడికి నెలకు రూ. 18 వేలు వేతనం కింద అదించేవారు. తాజాగా ఆపరేటర్లు ఉద్యోగ అవకాశాలను కోల్పోనున్నారు.

కొనసాగించాలి



ఎండీఎం వాహనాల ద్వారా సరుకుల పంపిణీ కొనసాగిస్తే పేదలకు ప్రయోజనం. ఇంటివద్దకే వాహనం వస్తే ఇంటిలో ఉన్నవాళ్ల వేలిముద్రతో రేషన్ తీసుకోవచ్చు. డీలర్ల వద్దకు వెళ్లి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండదు. దూరంగా ఉండే చౌక దుకాణం వద్దకు వెళ్లి రావడానికి, అక్కడ క్యూలో నిల్చుని సరుకులు తీసుకోవడం వల్ల ఇబ్బందులు పడాలి.

– ఎ.మాధవరెడ్డి, బి.కొత్తకోట

దిగులు పట్టుకుంది



బియ్యం బండి రద్దు చేస్తున్నారని తెలియడంతో దిగులు పట్టుకుంది. మోకాళ్ల నొప్పులతో నడవలేను. బియ్యం బండి నెలనెలా ఇంటి వద్దకే వస్తుంటే బాగుండేది. వాహనం రాకపోతే మా ఊరి నుంచి 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న స్టోరుకు వెళ్లాలి. రేషన్ బండిని కొనసాగించాలి. – కె.హుస్సేన్‌బీ, కొత్త కురవపల్లె, తంబళ్లపల్లె మండలం

ఎదురుచూపులు తప్పవు



ఇప్పటివరకు అందిస్తున్న ఇంటింటికి రేషన్ పంపిణీ పథకాన్ని రద్దు చేయడం దొంగకు తాళాలు ఇచ్చిన రీతిలో ఉంది. ఎంతో పారదర్శకంగా ఇంటికి రేషన్ బియ్యం అందేది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దుచేసి పేదల కడుపు కొట్టడంతో పాటు ఒక నిరుద్యోగి (వాహన డ్రైవరు) ఉపాధి కోల్పోయే పరిస్థితికి కారణమైంది. అంతేకాకుండా గంటల తరబడి డీలర్ షాపుల వద్ద వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదేనా ప్రజా సంక్షేమంటే. – శ్రీనివాసులు, పెద్దబిడికి, సంబేపల్లె మండలం

వృద్ధులు, వికలాంగులు ఎలా తెచ్చుకోవాలి



గత ప్రభుత్వం వృద్ధులను, వికలాగులను దృష్టిలో ఉంచుకొని రేషన్ డోర్ డెలివరీ వాహనాలను పెట్టింది. వీటిని తీసేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుంది. మా అమ్మగారికి 89 ఏళ్లు. ఆమె ఇప్పుడు మంచాన ఉంది. రైస్ కార్డులో ఒంటరిగానే ఉంది. ఆమెకు రేషన్ బియ్యం కావాలంటే ఫింగర్‌ప్రింట్ వేయాలి. అలాంటి వారి కోసమైనా ప్రభుత్వం ఈ రేషన్ డెలివరీ వాహనాన్ని కొనసాగించాలని కోరుతున్నాను. – కట్టా వెంకటసుబ్బయ్య, పెద్దకొత్తపల్లె, ఒంటిమిట్ట మండలం.

ముందుకు సాగని దళిత కమిషనర్ కేసు

– దౌర్జన్యం చేసిన టీడీపీ వర్గీయులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేయని పోలీసులు

రాజంపేట : అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణ మున్సిపాలిటీకి చెందిన దళిత కమిషనర్ నల్లా రాంబాబు తనపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యం చేశారని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టణ పోలీసుల కేసు నమోదు చేయలేదు. ఈనెల 5న మున్సిపాలిటీలో కమిషనర్ నల్లా రాంబాబు తన చాంబరులో ఉండగా టీడీపీ రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మరికొందరు దౌర్జన్యకరంగా వ్యవహరించిన విషయం విదితమే. గతంలో ఎన్నడూ రాజంపేటలో అధికారులపై దౌర్జన్యం చేసిన సంఘటనలు లేవని అధికారులు, ప్రజలు చెబుతున్నారు. మరో వైపు కమిషనర్ రాంబాబును బదిలీ చేయించడానికి తమ్ముళ్లు పావులు కదుపుతున్నారు. కమిషనర్‌పై జరిగిన సంఘటనకు మున్సిపాలిటీ సిబ్బందే ప్రత్యక్ష నిదర్శనం. అలాగే ఫిర్యాదును జిల్లా కలెక్టర్, ఎస్పీ, సబ్‌కలెక్టర్‌కు కమిషనర్ పంపించారు. అయినప్పటికీ కమిషనర్‌కు న్యాయం చేయడంలో ఎటువంటి పురోగతి కనిపించకపోవడంతో భవిష్యత్తులో తమకు ఇలా జరిగితే పరిస్థితి ఏంటి అని వివిధ శాఖల అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా కమిషనర్ అనారోగ్య పరిస్థితిలో వేలూరులో చికిత్స పొందుతున్నారు. ఆయన ప్రాణానికి ఏదైనా జరిగితే అందుకు ఆ రోజు మున్సిపాలిటీకి వచ్చిన టీడీపీ వర్గీయులే బాధ్యులవుతారంటున్నారు.

విచారణ చేస్తున్నాం..సీఐ

కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని పట్టణ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. ఇంతవరకు ఎఫ్‌ఐఆర్ కాలేదన్న సమాచారంపై విచారణ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారు.

కమిషనర్ ఫిర్యాదుపై సబ్‌కలెక్టర్ ఆరా

కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదుపై ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడంపై రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి ఆరా తీశారు. ఇందుకు సంబంధించి సీఐ వద్ద నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు ఈ విషయంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ జోక్యం చేసుకోవాలని దళితసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

న్యూస్‌రీల్

తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు

బి.కొత్తకోట : ఇంకా విధుల్లోకి చేరని బి.కొత్తకోట తహసీల్దార్ శ్రీధర్‌రావుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ శ్రీధర్ జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌ను ఆదేశించారు. బుధవారం మండలంలోని హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ సంస్థకు కేటాయించిన భూముల పరిశీలనకు వచ్చిన ఆయన పలు వివరాలను తెలుసుకుంటూ తహసీల్దార్ ఎక్కడ అని ప్రశ్నించారు. ఇంకా బాధ్యతలు చేపట్టలేదని, శుక్రవారం విధుల్లో చేరతారని సిబ్బంది చెప్పారు. దీంతో విధుల్లో చేరాలని చెప్పం కదా అంటూ షోకాజ్ నోటీసు ఇవ్వమని జేసీని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నాగేశ్వరరావు



ఇమాంతుల్లా

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇడగొట్టు నాగేశ్వరరావు, కార్యదర్శిగా పాలగిరి ఇంమాంతుల్లా, కోశాధికారిగా కోటపల్లె సుధాకర్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా పల్లపు రమణమ్మ, యువజన సంఘం కార్యదర్శిగా ఎం. వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంగన్‌వాడీ సెంటర్లకు పిల్లలు హాజరయ్యేలా చూడాలి

రాయచోటి : అంగన్ వాడీ సెంటర్లకు పిల్లలు వందశాతం హాజరయ్యేటట్లు చూడాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ సీడీపీఓలు, సూపర్ వైజర్లకు, బీపీసీ, డీపీసీలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శశికళ, సిడిపిఓలు, అంగన్ వాడీ సూపర్ వైజర్లు, బీపీసీలు, డీపీసీలు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఉజ్వల భవిత



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

పీలేరు : రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఉజ్వల భవిత ఉందని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవి చంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక కోటపల్లె వెంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో అరవిందో ఫార్మా ఫౌండేషన్, ఉద్యాన శాఖ సహకారంతో పీలేరు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు సంక్షోభాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం రైతులను ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సంఘాలుగా ఏర్పడి అభివృద్ధి చెందాలన్నారు. సంఘాలకు ప్రభుత్వం కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, ప్యాక్ హౌస్, పాలీ హౌస్, నర్సరీ షెడ్‌నెట్ తదితర సదుపాయాలు సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ గుణశేఖర్‌పిళ్లై మాట్లాడుతూ తమ శాఖ ద్వారా పశుకిసాన్ క్రెడిట్‌కార్డు, పశు బీమా పథకం, గోకులం పథకం, పీఎంఈజీపీ పథకాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోదేషావలి, ఉద్యానశాఖ అధికారి సుకుమార్, మత్స్యశాఖ అధికారి మోహన్‌కృష్ణ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఈవో దరహాస, డీఆర్‌సీ మహేష్, ప్రాజెక్ట్ మేనేజర్ భార్గవి, సీఈవో ప్రత్యూష, పూజిత పాల్గొన్నారు.

11న కన్యకాపరమేశ్వరిదేవి ప్రతిష్ట వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 11న ప్రతిష్ట వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, మంగళహారతి, గణపతి, రుద్ర, నవగ్రహ, చండీ హోమాలు ఉంటాయని పేర్కొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా వజ్ర కిరీటం, వజ్రపు చీరెతో అలంకరిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వినియోగం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి

రాయచోటి : 'ఒకల్ ఫర్ లోకల్' అనే నినాదంతో ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభిప్రాయపడ్డారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతపై అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో చేనేతతతో తయారు చేసిన మదనపల్లె స్కిల్ చీరలను అమ్మే స్టాల్‌ను కలెక్టర్ ప్రారంభించారు. 2023లో వన్ డిస్టిక్ వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ) కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో విశేష ఆదరణ కల్గిన మదనపల్లె స్కిల్ చీరకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. జిల్లా చేనేత, వస్త్ర శాఖాధికారి శ్రీదేవి తదిత పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్

అసైన్డ్ భూముల రీ వెరిఫికేషన్ పక్కాగా నిర్వహించాలి

కురబలకోట: జిల్లాలో అసైన్డ్ భూముల రీ వెరిఫికేషన్ పక్కాగా నిర్వహించాలని పొరపాట్లు దొర్లితే వేటు తప్పదని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హెచ్చరించారు. బుధవారం ఆయన రాయచోటి వెళుతూ మార్గమధ్యంలోని కురబలకోట రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు భద్రపరచిన గదిని పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దారు నవీన్, ఆర్ఐ సుగుణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో ఢిల్లీకి అన్నమయ్య టమాట

కలెక్టర్ చామకూరి శ్రీధర్

బి.కొత్తకోట: జిల్లాలో పండించే టమాటకు మార్కెటింగ్ కల్పించి రైళ్ల ద్వారా ఢిల్లీకి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం ఆయన బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌లతో పర్యటించారు. తర్వాత గుండ్లగుట్టపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మన ప్రాంతంలో పండించే టమాట 10 రోజులపాటు నిల్వ ఉంటుందని దీనికి మార్కెటింగ్, ప్రాసెసింగ్ సౌకర్యాలు కల్పిస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. టమాటను రైళ్లలో ఢిల్లీకి ఎగుమతులు చేసేలా పరిశీలిస్తామన్నారు. మదనపల్లెలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నార న్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగయ్యేలా ప్రణాళిక చేస్తున్నట్లు చెప్పారు. జూన్‌లో భారీ వర్షాలు కురిసినా జూలైన 50శాతం లోటు వర్షపాతం నమోదవవ్వడంతో సాగు 20శాతానికే పరిమితమైందన్నారు. కోడూరు, రాజంపేట, రాయచోటి ప్రాంతాల్లో ఖరీఫ్‌లో అరటి సాగవుతుందని, ఈ పంటకు బీమా కల్పించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ సమావేశాన్ని త్వరలోనే నిర్వహించి జిల్లా మంత్రిని ఆహ్వానిస్తామని చెప్పారు. కొండకు లభిస్తున్న ఆదాయం, వ్యయాలపై సమీక్షిస్తామన్నారు.

మీరే రాసుకున్నారా.

మండలంలోని గుండ్లగుట్టపల్లె (కాండ్లమడుగు) అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కేంద్రంలో 8 మంది పిల్లలుండగా నలుగురు మాత్రమే హాజరయ్యారు. రికార్డులు పరిశీలించిన కలెక్టర్ హాజరుపట్టికలో మీరే రాసుకున్నారా అని ప్రశ్నించారు. వివిధ కారణాలతో రాలేదని అంగన్‌వాడీ కార్యకర్త వివరించారు.

ప్లాస్టిక్ లేని హార్సిలీహిల్స్

హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ హోటల్స్‌కు ఇవ్వనున్న భూమిని కలెక్టర్ శ్రీధర్ పరిశీలించారు. గవర్నర్‌బంగ్లా, ఆటవీప్రాంగణం పరిశీలించాక హార్సిలీహిల్స్ కనుగొన్న డబ్ల్యూహెచ్ హార్సిలీ నాటిన మహానీలగిరి వృక్షాన్ని తిలకించారు. అనంతరం మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సర్వే ఏడీ జయరాజ్, డీటీఓ నాగభూషణం, డీటీ అన్సారీ, ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓ నరేంద్ర, సర్వేయర్ శ్రీవాణి పాల్గొన్నారు.

శ్రావణం.. శుభప్రదం

- ప్రారంభమైన శ్రావణమాసం
- ప్రతి రోజూ ప్రత్యేకతే
- నెల రోజులూ పూజలు, వ్రతాలు

కడప కల్చరల్./రాజుపాళెం/మదనపల్లె సిటీ/రాయచోటి : శ్రావణం.. శుభప్రదం..ఈ మాసానికి ప్రాముఖ్యత ఉంది. పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలోకి సంచరించటం వల్ల శ్రావణ మాసం పేరు వచ్చిందని వేదపండితులు చెబుతున్నారు. ఈ మాసం వస్తూనే పండుగలను తీసుకొస్తుంది. నాగుల పంచమి, రాఖీ పౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, తదితర పండుగలు ఈ మాసంలో వస్తాయి. ఈ మాసంలో మార్కెట్‌లో సందడి నెలకొంటుంది. నూతన వస్త్రాలు, అభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. పూలు,పండ్ల వ్యాపారులకు డిమాండ్ పెరగనుంది.



వరలక్ష్మివ్రతం చేస్తున్న మహిళలు(ఫైల్)

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని ప్రొద్దుటూరు, రాజుపాళెంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల, శివాలయం, అగస్త్యేశ్వర స్వామి, సత్యనారాయణ, రాజరాజేశ్వరి, పాత మార్కెట్ లోని ఆంజనేయ స్వామి, రామేశ్వరంలోని ముక్తి రామలింగేశ్వర స్వామి, బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వర స్వామి, అమృతేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. రాజుపాళెం మండలంలోని వెల్లాలలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర, నరసింహా స్వాముల ఆలయాల్లో భక్తులు పూజలు చేస్తుంటారు. ఈ మాసంలో వచ్చే శనివారాల్లో శ్రీదేవి, భూదేవి, శ్రీచెన్నకేశవ సంజీవరాయ స్వాములను పల్లకిలో ఆశీనులు చేసి ఊరేగించనున్నారు.

మోగేను 'కల్యాణవీణ'

కల్యాణ మండపాలు మళ్లీ కళకళలాడనున్నాయి.మామిడితోరణాలు కట్టిన వేదికలపై బంధుమిత్రుల కోలాహలం..బాజాభజంత్రీల నడుమ..వేద మంత్రాల సాక్షిగా.. మూడుముళ్లు వేసుకుని..ఏడడుగులతో కొత్త జంటలు నవజీవనాన్ని ప్రారంభించనున్నాయి. మూడు నెలల విరామం తర్వాత ముహూర్తాలు ఉండటంతో ఆగస్టు 8 నుంచి మళ్లీ కల్యాణ బాజా మోగనుంది. తర్వాత దాదాపు ఒకటిన్నర నెలపాటు ముహూర్తాలు లేవు. తర్వాత మూడు నెలలపాటు అంతంత మాత్రపు ముహూర్తాలే ఉన్నాయి. అందుకే వీలైనంత వరకు ఆగస్టులోనే పెళ్లి బజాలు వినిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం వివాహ ముహూర్తాలకు చాలా రోజులు విరామం వచ్చింది. ఇప్పటికే 3 నెలలపాటు పెళ్లిళ్ల లేవు. మార్చి 24న తర్వాత ఏప్రిల్, మే, జూన్, జులై మాసాల్లో వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ఎక్కడా పెళ్లి సందడి కనిపించలేదు. ఇన్ని రోజులపాటు వివాహాలు లేకపోవడంతో త్వరగా తమ పిల్లలకు పెళ్లిళ్ల చేసేందుకు పెద్దలు హడావుడి పడుతున్నారు.



వివాహ ముహూర్తాలు

ఆగస్టు	8,9,10,11,14,15,16,17,18, 21,22,23,24,28,30
సెప్టెంబర్	ముహూర్తాలేవు
అక్టోబర్	5,9,12,13,16,17,20,21,24,26,27
నవంబర్	3,4,6,7,8,11,13,16,17, 20,21,24,25,27
డిసెంబర్	4,5,6,7,9,10,11,14,16,19, 20, 22,24,25

గండికి శ్రావణ శోభ

చక్రాయపేట : వైఎస్సార్ జిల్లా గండిలో శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా అన్నిశాఖల అధికారులు సహకరించాలని ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య కోరారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. తొలి రెండు శనివారాలు భక్తుల రద్దీ ఓ మోస్తరుగా ఉన్నా మిగిలిన రెండు వారాల్లో లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సర్వ దర్శనం, ప్రత్యేక దర్శనం,వీఐపీ దర్శనాలకోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు..అలాగే పాపాఘ్ని నదిలో నీరు లేనందున నదిలో కాలువ తవ్వించినట్లు అధికారి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా టీటీడీ అధికారులు సహకారం అందించినట్లు వెంకటసుబ్బయ్య తెలిపారు.

అభిషేకాలు ఉండవు

ఉత్సవాల సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిలిపేసినట్లు ఆలయ ప్రధాన ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్, రాజగోపాలాచార్యులు తెలిపారు. మూల వి రాట్‌కు బదులుగా బాలాలయంలో ధారువు విగ్రహం ఉన్నందున ఈనిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. శ్రావణ మాసంలో స్వామి వారికి ఉదయం 3–30 నుంచి 4వరకు సుప్రభాతం,4 నుంచి 5వరకు అలంకరణ,5–30 నుంచి 12వరకు దైవదర్శనం 12–30కు మహానైవేద్యం, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.



గండి వీరాంజనేయ స్వామి మూలవిరాట్

శ్రావణం..భక్తి మాసం



శ్రవణ నక్షత్రమే వెంకటశ్వర స్వామి అవతార నక్షత్రం. ఈ మాసాన్ని మహిళలు అత్యంత పవిత్రంగా భావిస్తారు. మంగళగౌరి, వరలక్ష్మి వ్రతాలతో అమ్మవారిని కొలుస్తారు. దీక్షలు చేస్తారు. రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగలు ఈనెలలో వస్తాయి. అందుకే శ్రావణమాసాన్ని భక్తిమాసంగా భావిస్తారు. – సాయిచక్రవర్తి, వేదపండితులు, మదనపల్లె.

సకల శుభాలకు నెలవు..



శ్రావణ మాసంలో భక్తితో భగవంతుడిని ఆరాధిస్తే సకల శుభాలు వరిస్తాయి. పండుగలు, పర్వదినాలకు నోములు, వ్రతాలకు అనువైన మాసం. సిరిసంపదలు ప్రసాదించమంటూ మహాలక్ష్మిని కొలిచే శ్రావణంలో శివశక్తిని పూజిస్తారు. శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం శ్రావణం. – వీణా మాధవాచార్యులు, అర్చకుడు, వెల్లాల, రాజుపాళెం మండలం

ఇంటింటా పండగే



శ్రావణమాసంలో అందరూ భక్తితో పరవశిస్తారు. ఈ మాసంలో ఇంటింటా పండగ వాతావరణమే కనిపిస్తుంది. విష్ణుమూర్తికి ఇష్టమైన మాసం శ్రావణం. అందుకే ఈ మాసంలో అందరూ పవిత్రతో శుభ కార్యక్రమాలను నిర్వహించుకుంటారు. అయితే ఈ నెల 28 వరకే శుభ ముహూర్తాలు ఉన్నాయి. – బన్నూరు సత్యవర్ధన్‌శర్మ, అర్చకుడు, రాయచోటి

ఖర్చయినా...తప్పదు కదా



అవసరాన్ని బట్టి డిమాండ్ పెరగడం మామూలే. పెళ్లి ఖర్చులకు సంబంధించి అన్నింటి ధరలు పెరిగాయి. అయినా వివాహాలను ఆపలేం కదా! అందుకే ఖర్చు చూసుకోకుండా అనుకున్న తేదీల్లోనే వివాహాలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకోక తప్పదు. – చిల్లారి రెడ్డెయ్యరాజు, కడప

క్లుప్తంగా

రామయ్య గర్భాలయం మరమ్మతులకు భూమిపూజ



గర్భాలయ మరమ్మత్తులకు భూమిపూజ

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి గర్భాలయాన్ని అధునాతనంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ చేశారు. రాష్ట్ర పురావస్తు శాఖ సూపరింటెండెంట్ గోపీనాథ్, జన పర్యవేక్షణలో అంతరాలయం, గర్భాలయం, రంగమండపం, విమాన గోపురాన్ని పురావస్తుశాఖ ఇంజినీరింగ్ అధికారులు కొలతలు తీశారు. అనంతరం మరమ్మతు పనులు చేసే గుత్తేదారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పురావస్తుశాఖ అడిషనల్ సూపరింటెండెంట్ దేవంద్రబోయి, జిల్లా పురావస్తుశాఖ అధికారి బాలకృష్ణారెడ్డి, పురావస్తుశాఖ ఇంజనీర్ భాను ప్రకాష్ వర్మ, ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ నాగరాజు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాన్ని తొలగిస్తున్న దృశ్యం

సిద్దవటం : మండలంలోని నిర్మలగిరి కాలనీ శివారున సర్వే నెంబర్ 870/3 భూమిలో అక్రమ కట్టడాలను బుధవారం తొలగించామని ఆర్ఐ అనూరాధ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం, ప్రహరీ పనులు చేపట్టారని, ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించి వెంటనే అక్రమ కట్టడాలను తొలగించామన్నారు. నిర్మాణాలకు ఆధారాలుంటే తహసీల్దారు కార్యాలయానికి తీసుకు రావాలని బాధితుడికి ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో నాని పాల్గొన్నారు.

రెచ్చగొట్టి.. రచ్చ చేసిన తమ్ముళ్లు



టీడీపీ నాయకుల ఆందోళన



మండల పరిషత్ కారాయలయం ఎదుట పోలీసు బలగాలు

- లోకేష్‌ను అవమానించారని మండల మీట్‌ను అడ్డుకునే యత్నం
- శాంతి భద్రతల దృష్ట్యా పెద్దతిప్పసముద్రం మండల్ మీట్ వాయిదా

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : రెచ్చగొట్టి గొడవలు సృష్టించాలని ప్రయత్నించిన టీడీపీ నాయకుల కుట్రను పోలీసులు భగ్నం చేసారు. పీటీఎం సచివాలయం బయట ఏర్పాటుచేసిన శిలా పలకాలు తొలగించాలనే తమ్ముళ్ల ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండల మీట్ బుధవారం ఏర్పాటు చేశారు. కోఆప్షన్ సహా 13 మంది సమావేశానికి హాజరయ్యారు. అయితే సభ్యులు కాని పలువురు వ్యక్తులు సమావేశంలోకి ప్రవేశించారని, గో బ్యాక్ ఎంపీటీసీ అంటూ తెలుగు తమ్ముళ్లు నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. గతంలో నారా లోకేష్‌ను అవమానించారనే వాదన తెరపైకి తీసుకువచ్చి టీడీపీ శ్రేణులు సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అధిక సంఖ్యలో తరలి రావడం, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలు కాసేపు ఉద్రిక్తతకు దారితీశాయి. టీడీపీ నేతలు రెచ్చగొట్టినా వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంయమనం పాటించారు.

పోలీసుల రంగ ప్రవేశం..

ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న మదనపల్లి డీఎస్పీ కొండయ్య నాయుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఐదుగురు సీఐలు, ఆరుగురు ఎస్ఐలతోపాటు 50 మంది పోలీసులను రంగంలోకి దింపారు. మెయిన్ రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. జెడ్పీ హైస్కూల్, ఎంపీడీవో కార్యాలయం మెయిన్ గేటు వద్ద కూడా భారీగా పోలీసులు మోహరించారు. అనంతరం సమావేశంలో పాల్గొనేందుకు ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యుడు, అధికారులు లోనికి వెళ్ళేందుకు ప్రయత్నించగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. మండల్ మీట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి ప్రకటించడంతో సమస్య సద్దు మణిగింది.

పెద్దిరెడ్డి కుటుంబంపై ఆరోపణలు తగవు

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె : నాలుగు దశాబ్దాలుగా పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయాల్లో ఉంటున్నా.. ఎక్కడా అవినీతి, అక్రమాలను ప్రోత్సహించిన దాఖలాలు లేవని మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి గృహంలో బుధవారం జరిగిన సమావేశంలో చింతలరామచంద్రారెడ్డి మాట్లాడుతూ...సబ్ కలెక్టరేట్‌లోని ఫైళ్ల దగ్ధం ఘటనలో జరుగుతున్న పోలీస్ విచారణలో పెద్దిరెడ్డి కుటుంబంపై ఆరోపణలు నిర్ధారణ అయినట్లు ప్రకటించనప్పటికీ, మాజీ మంత్రిపై కథనాలు ప్రసార మాధ్యమాల్లో, ఎల్లో మీడియాలో ప్రచారం చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా ఉన్న కీలక వ్యక్తి కావడంతో ప్రతిపక్ష నాయకులు అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. వాస్తవాల ఆధారంగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలి గానీ, పత్రికా కథనాల ఆధారంగా రాజకీయ ప్రత్యర్థులు ఎవరి పేర్లను ఉదహరిస్తే... వారందరిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. వాస్తవాలు చెప్పేవారి గొంతుక నొక్కే విధంగా విచారణ అధికారులు వ్యవహరించవద్దన్నారు. వాస్తవాలు కొద్దిరోజుల్లో విచారణాధికారులు వెలుగులోకి తెస్తారని, అప్పటివరకు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. విచారణలో ఘటనకు బాధ్యులుగా తేలిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ...పెద్దిరెడ్డి కుటుంబంతో తమ తండ్రి హయాం నుంచి స్నేహ సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు పెద్దిరెడ్డి కుటుంబం కృషి చేసిన నేపథ్యంలో వారినే రాజకీయంగా నిలువరించేందుకు అసత్య కథనాలు ప్రచారం చేస్తున్నారన్నారు. రాజకీయ కక్షతో వైఎస్సార్‌సీపీ నాయకులనే టార్గెట్‌గా చేసి పార్టీ నేతలపై అవాస్తవాలు రాయిస్తున్నారన్నారు.

దండు మారెమ్మ ఆలయంలో చోరీ

మదనపల్లె : పట్టణంలోని దండు మారెమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పట్టణంలోని దండుమారెమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తలుపులు పగలగొట్టి లోనికి ప్రవేశించి బీరువాను ధ్వంసం చేశారు. అమ్మవారి నెక్లెస్, వడ్డాణం, బొట్టు చైన్, తదితర ఆభరణాలు అపహరించుకుపోయారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. చోరీ ఘటనపై వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

చోరీకి యత్నం

నెమలి నగర్‌లో నివాసముంటున్న గోపాల్ నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి తంబళ్లపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆయన ఇంట్లో ప్రవేశించి చోరీకి ప్రయత్నించారు. ఈ విషయం గమనించిన గోపాల్ నాయక్ సోదరుడు చోరీ యత్నానికి సంబంధించిన సమాచారం పోలీసులకు తెలిపారు. వారు చేరుకుని దుండగులు చోరీకి ప్రయత్నించారని నిర్ధారణ చేశారు.

వడ్డాణం ఆశ చూపి.. లక్ష రూపాయలు స్వాహా

బి.కొత్తకోట : చవకగా బంగారు వడ్డాణం వస్తుందనే ఆశతో ఓ మహిళ లక్ష రూపాయలు ఇచ్చి మోసపోయిన ఉదంతం బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం మేరకు.. బి.కొత్తకోట సమీపంలోని నక్కరాజుపల్లె క్రాస్ వద్ద ఈశ్వరమ్మ టీకొట్టు పెట్టుకుని జీవిస్తోంది. మూడురోజుల కిందట ఓ జంట ఆమె వద్దకు వచ్చి 'తమ వద్ద నిజమైన బంగారు వడ్డాణం ఉంది.. దాన్ని విక్రయించాలని అనుకొంటున్నాం.. తక్కువ ధరకే ఇస్తాం' అంటూ నమ్మించారు. నిజమైన బంగారమో కాదో పరీక్షించుకోవాలని వడ్డాణం అంచున ఓ ముక్క కత్తిరించి ఇచ్చారు. ఆ ముక్క తీసుకొన్న ఈశ్వరమ్మ బి.కొత్తకోటలోని బంగారు దుకాణదారు వద్దకు వెళ్లి పరీక్షించగా అసలైన బంగారమే అని తేలింది. దీంతో తక్కువ ధరకు వడ్డాణం వస్తుందని ఆశపడి వారు అడిగిన లక్ష రూపాయల నగదు ఇచ్చి వడ్డాణం తీసుకుంది. దాన్ని తీసుకుని మళ్లీ బంగారు దుకాణదారుని వద్దకు వెళ్లి పరీక్షిస్తే అది ఇత్తడిదని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించిన ఈశ్వరమ్మ లబోదిబోమంటోంది.



ఇత్తడి వడ్డాణంతో ఈశ్వరమ్మ

ఆ టీచర్ ఉంటే.. పిల్లలను బడికి పంపం

కురబలకోట : విద్యార్థినులను లైంగికంగా వేధిస్తూ పోక్సో చట్టం కింద కేసు నమోదైన టీచర్ గోపీనాథ్ తమకు వద్దంటూ మండలంలోని ముదివేడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. హైస్కూల్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇలాంటి టీచర్ ఉంటే తమ పిల్లలను వేరే బడులకు పంపాల్సి ఉంటుందని హెచ్చరించారు. గతంలో మదనపల్లె జెడ్పీ హైస్కూల్‌లో ఉంటున్న ఓ విద్యార్థినిని లైంగికంగా వేధించినందుకు పోక్సో చట్టం కింద కేసు నమోదైందన్నారు. ఆ టీచర్‌కు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చిన డీఈఓపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతిపత్రం పంపారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మైదుకూరు : విద్యుదాఘాతంతో ఓ మహిళా రైతు మృతి చెందిన సంఘటన బుధవారం మైదుకూరు మండలం లింగాలదిన్నె గ్రామంలో జరిగింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. లింగాలదిన్నె గ్రామానికి చెందిన ధనికెల కృష్ణయ్య, ఓబుళమ్మ తమ పొలంలో ఉల్లి పంట సాగు చేశారు. బుధవారం మధ్యాహ్నం భార్యా, భర్తలు పొలంవద్దకు వెళ్లారు. ముందుగా కృష్ణయ్య పొలానికి చేరుకోగా.. వెనకే వస్తున్న ఓబుళమ్మ పక్క పొలంలోని మోటారుకు అమర్చిన స్టార్టర్ వద్ద వస్తుండగా ప్రమాదవశాత్తూ తీగ తగిలింది. విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ శాఖ అధికారుల విచారణ

నిమ్మనపల్లె : మండలంలోని గొల్లపల్లి సమీపంలో నూరుకుప్పల కొండ అటవీ ప్రాంతం నుంచి టీడీపీ నాయకుడు ఆర్.జే.వెంకటేష్ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో అటవీ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. మదనపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మదన్మోహన్, సబ్ డివిజన్ అటవీ శాఖాధికారి శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి గొల్లపల్లి సమీపంలోని అటవీ ప్రాంతానికి చేరుకొని ఇసుక తవ్విన ప్రదేశాలను పరిశీలించారు. సదరు భూమి ఎవరికి చెందుతుందనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్.జే.వెంకటేష్ కు చెందిన మామిడి తోటను పరిశీలించారు. అతడి ఇంటి వద్ద నిల్వ ఉంచిన ఇసుకను తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణానికి ఇసుక తరలించినట్లు ఆర్.జే.వెంకటేష్ అధికారులకు తెలిపారు. క్షేత్ర స్థాయి విచారణ అనంతరం అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ నూరుకుప్పలకొండ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో పరిశీలించామన్నారు. అటవీ భూముల్లో ఇసుక తవ్వకాలు జరగలేదని, టీడీపీ నాయకుడు ఆర్.జే.వెంకటేష్‌కు చెందిన వ్యవసాయ భూముల్లో తవ్వకాలు జరిగాయని గుర్తించామన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు సుధాకర, శోభారాణి, హరి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మామిడి తోటలో ఆర్.జె వెంకటేశ్ ను విచారిస్తున్న అటవీ శాఖ అధికారి శ్రీనివాసులు

అన్నమయ్య 'టీడీపీ' అతిథి గృహం!

రాజంపేట : అధికార దుర్వినియోగం అంటే ఇదేనేమో..ఏకంగా రాజంపేట పట్టణంలోని నడిబొడ్డులో ఉన్న అన్నమయ్య అతిథి గృహం కాస్త తెలుగు దేశం పార్టీ కార్యాలయంగా మారిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అన్నమయ్య అతిథి గృహం రోడ్లు, భవనాల శాఖ నిర్వహిస్తోంది. ఎన్నికలకు ముందు ఐఏఎస్ అధికారులు వస్తారనే ఉద్దేశ్యంతో కలెక్టర్ ప్రత్యేక నిధులు వెచ్చించి అతిథి గృహం తీర్చిదిద్దారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ టీడీపీ నియోజకవర్గ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం ఈ అతిథి భవనాన్ని పార్టీ కార్యాలయంగా మార్చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బుధవారం ఆయన నేరుగా తన వాహనంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చేరుకోగా, వెనువెంటనే టీడీపీ నేతలు, కార్యకర్తలు చేరారు. ఇంకేముంది ఏకంగా.. సమావేశాలు, మంతనాలు కొనసాగించారు. ప్రోటోకాల్ పరంగా కూడా ఆర్‌అండ్‌బీ గదిని కేటాయించే వీలులేదు. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రితోపాటు ప్రజాప్రతినిధులకు కోరిన మేరకే గదిని కేటాయిస్తారు. అయితే ఎలాంటి ప్రోటోకాల్ లేకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు సుగవాసికి గదిని ఏ విధంగా అనుమతించారో తెలియడంలేదని స్థానికులు పెదవివిరిస్తున్నారు. ఇదిలా ఉంటే అధికారులు కూడా వచ్చి బొకేలు, సన్మానాలు చేసి పోవడంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.



అన్నమయ్య అతిథిగృహం వద్ద సుగవాసి వాహనాలు

వ్యక్తి అదృశ్యం

మదనపల్లి: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. దేవతా నగర్‌కు చెందిన అహ్మద్‌బాషా కుమారుడు సయ్యద్ నూర్ (31) మెకానిక్ పనిచేసేవాడు. గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటిపట్టునే ఉండే వాడు. ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లిన సయ్యద్ నూర్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796741కు సమాచారం అందించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆపై ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన నూరుల్లాఖాన్(45) మదనపల్లె పట్టణంలోని అయోధ్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం కురబలకోట మండలం ముదివేడులో బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడే కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది పురుగుమందు తాగాడు. ఆపై ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

గండి ఆంజనేయస్వామి మాన్యం గుర్తింపు

చక్రాయపేట : ఖాజీపేట మండలంలో ఆక్రమణకు గురైన గండి ఆంజనేయ స్వామి మాన్యం 21 సెంట్లను తాజాగా అధికారులు గుర్తించారు. మండలంలోని చెన్నముక్కపల్లె పంచాయతీలోని సర్వే నెంబర్ 192-3లో 21 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని ఎవరికీ తెలియకుండా కొందరు ఆక్రమించి సాగు చేస్తున్నారు. ఆలయానికి రూపాయి కూడా చెల్లించలేదు. అయితే ఇటీవల ఈ భూమి ఆలయ మాన్యం అని తెలియడంతో అధికారులు స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

సురక్షితంగా గమ్యాన్ని చేరండి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి
- 1700 హెల్మెట్‌లు, 50 వీల్ ఛైయిర్ల పంపిణీ



వీల్ ఛైయిర్‌ను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్‌ను ధరించి సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి తెలిపారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జి. శ్రీదేవి మాట్లాడుతూ అతివేగం ప్రాణానికి ముప్పు అని గ్రహించాలన్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు ఇంటి వద్ద ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యులను గుర్తుంచుకోవాలన్నారు. ఎస్పీ వి. హర్ష వర్ధన్ రాజు మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో హెల్మెట్‌ల ప్రాధాన్యం గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో హెల్మెట్ ధరించకపోతే జరిమానా, శిక్ష తప్పవన్నారు. అనంతరం వివిధ ఫ్యాక్టరీల యాజమాన్యాల సౌజన్యంతో 1700 హెల్మెట్లు, విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. వివిధ కోర్టులకు హాజరయ్యే దివ్యాంగులు, వృద్ధుల కోసం 50 వీల్ ఛైయిర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు ఎల్.వెంకటేశ్వరరావు, జి.దీనబాబు, షేక్ ఇంతియాజ్ అహ్మద్, ఎస్.ప్రవీణ్‌కుమార్, కె. ప్రత్యూష కుమారి, జడ్జి జె.హేమస్రవంతి, జె.నందిని, కె.భార్గవి, విజయలక్ష్మి, డీటీసీ మీరా ప్రసాద్, డిజేబుల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్, జిల్లా అధికారులు, బొగ్గుల గుర్వప్పనాయుడు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంస్థల ప్రతినిధులకు సన్మానం: డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి కృషితో 1700 హెల్మెట్‌లను, 50 వీల్ ఛైయిర్లు పంపిణీ చేసేందుకు సహకరించిన ఆదిత్యాబిర్లా, భారతి సిమెంట్స్, ఇండియా సిమెంట్స్, దాల్మియా సిమెంట్స్, హెచ్‌సీఎల్, జువారీ సిమెంట్స్, సంయు గాజు, శతాబ్దపు ప్యానెల్స్, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్, ఆర్‌టిపిపి, ఆల్ డిక్సన్ ప్రతినిధులను న్యాయమూర్తులు, జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు.

కారు ఢీకొని ఒకరు మృతి



మృతి చెందిన యువకుడు

కురబలకోట : మండలంలోని కంటేవారిపల్లె వద్ద బుధవారం రాత్రి మోటార్ సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ముదివేడు పోలీసుల కథనం మేరకు..వినాయక చవితి విగ్రహాల కొనుగోలుకు తంబళ్లపల్లె మండలం కొటాలకు చెందిన నాని(22) మరొకరితో కలిసి మోటార్ సైకిల్‌పై బుధవారం రాత్రి కంటేవారిపల్లెకు వచ్చారు. విగ్రహాలను చూసిన అనంతరం తిరిగి వెళుతున్న క్రమంలో బి.కొత్తకోట వైపు నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ సంఘటనలో నాని అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరు రఘునాయక్ (21) పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కృష్ణా జట్టు ఘనవిజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా జట్టు విజయం సాధించగా, నెల్లూరు-కడప, చిత్తూరు-పశ్చిమగోదావరి మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 122 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 57.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 179 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జట్టులో నిఖిల్ 62, ధనుష్ 56 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 36.5 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులో థామస్ రామ్ 39, రోహిత్ కుమార్ 33 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్ రాజేష్ 7 వికెట్లు తీయగా, సాయిప్రకాష్ 2 వికెట్లు తీశాడు. దీంతో కృష్ణా జట్టు 122 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కృష్ణా జట్టు 219 పరుగులు చేయగా, శ్రీకాకుళం జట్టు 137 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

నెల్లూరు, కడప మ్యాచ్ డ్రా..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 334 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 98 ఓవర్లలో 415 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మన్విత్‌రెడ్డి 193 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కడప బౌలర్లు ధీరజ్ 3, ఆర్థిత్‌రెడ్డి 2, నాగకుల్లాయప్ప 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 42 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. జట్టులోని గురుచరణ్ 45, సాయిచేతన్ 54 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ మోహన్ 2, భార్గవ్ మహేష్ 2 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 347 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

చదువుతోపాటు క్రీడలు అవసరం

నవోదయ ప్రిన్సిపల్ గోవిందరావు

మదనపల్లె సిటీ : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమని జవహర్ నవోదయ ప్రిన్సిపల్ గోవిందరావు అన్నారు. స్థానిక చిత్తూరురోడ్డులోని నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్ మీట్ నిర్వహించారు. క్రీడా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. గోవిందరావు మాట్లాడుతూ ఒలింపిక్స్ క్రీడల్లో మన క్రీడాకారులు సత్తా చాటుతున్నారన్నారు. నవోదయ విద్యాలయాల్లో క్రీడలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వేలాయుధన్, వ్యాయామోపాధ్యాయులు సురేంద్రరెడ్డి, కొతాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్ మీట్‌లో అనంతపురం, చిత్తూరు, కడప, కరైకల్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, పుదుచ్చేరి విద్యాలయాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ మీట్ గెలుపొందిన విజేతలు వీరే

3000 మీటర్ల అండర్17 పరుగుపందెంలో బి.జీవన్ రెడ్డి (జెఎన్‌వి, చిత్తూరు) ప్రథమ, ప్రదీప్‌చంద్(జెన్‌వి కడప) ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. బాలికల విభాగంలో బి.గౌతమి (జెఎన్‌వి,చిత్తూరు) ప్రథమ స్థానం దక్కించుకున్నారు.

3000 మీటర్ల అండర్19 పరుగుపందెంలో గంగా తరుణ్ (జెఎన్‌వి,చిత్తూరు) ప్రథమ, బాలికల విభాగంలో సింధు (జెఎన్‌వి,చిత్తూరు) ప్రథమ స్థానం దక్కించుకున్నారు. 800 మీటర్ల పరుగుపందెంలో బాలుర విభాగంలో ప్రభాస్ (జెఎన్‌వి, చిత్తూరు) ప్రథమ, బాలికల విభాగంలో కె.పావని (జెఎన్‌వి, చిత్తూరు) ప్రథమ స్థానం దక్కించుకున్నారు.

800 మీటర్ల పరుగుపందెంలో అండర్-17 బాలుర విభాగంలో ప్రభాస్(జెఎన్‌వి,చిత్తూరు) మొదటి స్థానం దక్కించుకున్నారు.

ట్రిపుల్ జంప్ అండర్-17 బాలికల విభాగంలో శ్రీజ (జెఎన్‌వి, నెల్లూరు) ప్రథమ, బాలుర విభాగంలో సాంబశివారెడ్డి (జెఎన్‌వి,చిత్తూరు) ప్రథమ స్థానం దక్కించు కున్నారు. 3 కె రన్ అండర్-19 బాలికల విభాగంలో చందనాల్, (జెఎన్‌వి,చిత్తూరు), 5 కెరన్ అండర్-17 బాలుర విభాగంలో దీపక్ (జెఎన్‌వి, చిత్తూరు), 5 కె రన్ అండర్-19 బాలుర విభాగంలో నిషాంత్ (జెఎన్‌వి, చిత్తూరు) మొదటి స్థానాలు దక్కించుకున్నారు.

నవోదయాలో పోటా పోటీగా క్లస్టర్ గేమ్స్

రాజంపేట : జవహర్ నవోదయా విద్యాలయంలో బుధవారం క్లస్టర్ గేమ్స్ పోటాపోటీగా సాగాయి. కడప క్లస్టర్‌లో కబడ్డీ, కోకో, చెస్, యోగ, టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. కడప, అనంతపురం, నెల్లూరు, కర్నూలు, ప్రకాశం-2, చిత్తూరు, కరైకల్, పుదుచ్చేరికి చెందిన నవోదయ విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రభుత్వ పీఈటీలు వ్యవహరించారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరిచిన 221 మంది విద్యార్థులను ప్రాంతీయ మీట్‌కు ఎంపికచేయనున్నారు.



5 కె రన్ బాలుర విభాగంలో విజేత దీపక్‌కు ప్రశంసాప్రత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందరావు



చెస్ ఆడుతున్న నవోదయ విద్యార్థినులు